క్లుప్తంగా

మద్దిలో పోటెత్తిన భక్తులు



గుర్వాయిగూడెం మద్ది క్షేత్రం భక్తులకు కిక్కిరిసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవల, విరాళాల ద్వారా రూ. 2,11,255 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. కామవరపుకోట మండలం జలపవారిగూడానికి చెందిన శ్రీ భక్తాంజనేయ భజనసమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

పారిజాతగిరిలో పూజలు



విశేషాలకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. శనివారం ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడడంతో విద్యార్థులు స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.
భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, కుటుంబసభ్యులు మజ్జిగ వితరణ చేయగా, అల్లూరి శ్రీనివాసరావు, వంశీకృష్ణ అన్నప్రసాద వితరణ చేశారు.

వీధిలైట్ల పునరుద్ధరణ



వీధిలైట్లకు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురం గ్రామంలో వీధిలైట్లకు శనివారం మరమ్మతులు నిర్వహించారు. సర్పంచ్ యడ్లపల్లి రాధి, ఉపసర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు పర్యవేక్షణలో పాడైన వీధిలైట్ల స్థానంలో నూతన వీధిలైట్లు, అవసరమైన వాటికి మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు పంచాయతీ పరిధిలో చాలా చోట్ల వీధిలైట్లు దెబ్బతిన్నాయని, వాటిని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

రూ.35 లక్షల సొంత నిధులతో వంతెన నిర్మాణం



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గోరుముచ్చు గోపాల్ యాదవ్

కామవరపుకోట: హేమ గోపాల్ ఫౌండేషన్ ద్వారా గుంటుపల్లి గ్రామ పంచాయతీ కంఠమనేనివారిగూడెంలోని చింతల చెరువు వాగు వద్ద సుమారు రూ.35 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి తమ సొంత నిధులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్రుముచ్చు గోపాల్ యాదవ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. వంతెన నిర్మాణంపై ఎస్సీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సామాజిక కార్యకర్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీవీఎం నగేష్ 116 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుర్వేద వైద్యంలో అన్ని వ్యాధులకూ చికిత్స ఉందని చెప్పారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

దెందులూరు: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ప్లాటం ప్రసాద్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జిల్లా కార్యదర్శి డి.ప్రేమ్ బాబు పిలుపునిచ్చారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో వారు మాట్లాడారు. సామాజిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా అంబేడ్కర్ తన జీవితాన్ని ధారపోశారని గుర్తుచేశారు.

ఇంటర్‌లో గురుకుల విద్యార్థులదే హవా



ద్వారకాతిరుమలలోని గురుకుల కళాశాల



జంగారెడ్డిగూడెం: ఉత్తీర్ణులైన విద్యార్థులతో తపస్ జూనియర్ కళాశాల యాజమాన్యం

ద్వారకాతిరుమల: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ద్వారకాతిరుమలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 80 మంది విద్యార్థినులకుగాను 78 మంది ఉత్తీర్ణులు కాగా 97.5 శాతం, రెండో సంవత్సరం ఫలితాల్లో 70 మంది విద్యార్థినులకుగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి తెలిపారు. అందులో జూనియర్ ఇంటర్ ఎంపీసీ నుంచి 475 మార్కులకుగాను ఒ.ప్రతిభ 449, కె.ఐశ్వర్య 435, ఎ.కీర్తన 434 మార్కులు సాధించినట్టు చెప్పారు. అలాగే బైపీసీ నుంచి 440 మార్కులకుగాను పి.జయ వీర కౌషికా 429, టి.అక్షిత 415, కె.నాగదుర్గ 414 మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఎంపీసీ నుంచి 1000 మార్కులకుగాను అత్యధికంగా డి.భార్గవి 954, టి.మహిష్క 952, బి.ప్రసన్న 940 మార్కులు సాధించినట్టు చెప్పారు. బైపీసీ నుంచి ఎన్.దుర్గాభవాని 981, బి.సమీర 966, పి.గీతాన్విత 961 మార్కులు సాధించినట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్మీడియెట్‌లో 15 మంది విద్యార్థినులు 400కు పైగా, సీనియర్ ఇంటర్‌లో 36 మంది విద్యార్థినులు 900కు పైగా మార్కులు సాధించి, ప్రతిభను కనబరచినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్ రాణి, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

బుట్టాయగూడెంలో 70 శాతం ఉత్తీర్ణత

బుట్టాయగూడెం: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరం 58 శాతం, ద్వితీయ సంవత్సరం 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి. కుసుమ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం 205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 119 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 182 మంది విద్యార్థులు హాజరుకాగా 128 మంది విద్యార్థులు 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

తపస్ విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జంగారెడ్డిగూడెంలోని తపస్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల చైర్మన్ దాకారపు కృష్ణ తెలిపారు. కళాశాల ప్రారంభించిన మొదటి సంవత్సరమే అత్యధిక ఉత్తీర్ణత శాతం 92 శాతం సాధించడం జరిగిందన్నారు. మొత్తం 135 విద్యార్థులకు గాను 124 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు కె.రావూరి జైత్ర 464, జె.శ్రావణ్ 461, ఎం.లిఖిత 461, బైపీసీ విభాగంలో 440 మార్కులకు కె.అక్షయ 412, ఎస్.తరుణ్ శ్రీ కార్తికేయ 411 మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకు వి.పావికప్రియ 470 మార్కులు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను వైస్ చైర్మన్ పారేపల్లి నరేష్, సెక్రటరీ, కరస్పాండెంట్ బుద్దాల గోపి, డైరెక్టర్లు ఎస్.హరిప్రసాద్, జి.ఆదిత్య, బుద్దాల సురేష్ అభినందించారు.

కుక్కునూరులో తగ్గిన ఉత్తీర్ణత

కుక్కునూరు: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 33 శాతం, కేజీబీవీ కుక్కునూరు 74 శాతం, కేజీబీవీ వేలేరు 44 శాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 35 మంది విద్యార్థులు హాజరుకాగా 8 మంది రెండో సంవత్సరం పరీక్షలకు 46 మంది హాజరుకాగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు. కుక్కునూరు కేజీబీవీలో ఫస్ట్ ఇయర్‌లో 29మందికిగాను 22 మంది, సెకండ్ ఇయర్‌లో 30 మందికిగాను 22 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ వేలేరులో ఫస్ట్ ఇయర్‌లో 22 మందికిగాను 9 మంది, సెకండ్ ఇయర్‌లో 5 మందికిగాను ముగ్గురు ఉత్తీర్ణులయ్యారు.

బాలికలదే పైచేయి



నాగ సత్యప్రియ, గూటాల 911 మార్కులు



సునీత, ధర్మాజీగూడెం 978 మార్కులు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ఈ ఏడాది కూడా ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. శనివారం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 55.5 శాతం, ద్వితీయ సంవత్సరం 84.2 శాతం ఉత్తీర్ణత సాధించారని పోలవరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నజిని తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 437/470 మార్కులతో మడకం కీర్తి, ద్వితీయ సంవత్సరం బైపీసీలో 839/1000 మార్కులతో సీహెచ్ వెంకటదుర్గ కాలేజీ టాపర్లుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గూటాల హైస్కూలు ప్లస్‌లో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 8 మంది విద్యార్థినులకు నూరుశాతం ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ కేవీ రాఘవన్ తెలిపారు. వారిలో మారుముఖం నాగసత్యప్రియ 911/1000 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలిచారని, 839 మార్కులతో కోలా నాగవినూత్న రెండవ స్థానం, 818 మార్కులతో సారిక లక్ష్మీశ్రీ మూడవ స్థానంలో నిలిచారని, ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 5 మంది విద్యార్థులకుగాను ఒక్క విద్యార్థి మాత్రమే ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

శ్రీ సాయి ప్రతిభ కళాశాలల విజయకేతనం

లింగపాలెం: ఇంటర్ ఫలితాల్లో ధర్మాజీగూడెంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాల, శ్రీ ప్రతిభ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. ద్వితీయ సంవత్సరంలో అన్నవరపు సునీత 978 మార్కులు, ప్రథమ సంవత్సరంలో వేల్పుల జాహ్నవి 457 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 74 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం 78 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కోసూరి నరసింహారావు, డైరెక్టర్ కోసూరి సుజాత కుమారి, ప్రిన్సిపాల్ డల్లి రత్నారావు అభినందించారు.

సెల్‌ఫోన్ దొంగను పట్టుకున్న భక్తుడు

ద్వారకాతిరుమల: భక్తుల రద్దీని పురస్కరించుకుని స్థానిక కొత్త బస్టాండ్‌లో సెల్‌ఫోన్ దొంగలు శనివారం రెచ్చిపోయారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్ దొంగను ఓ భక్తుడు పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. స్థానికుల కథనం ప్రకారం. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం, ముప్పర్తిపాడుకు చెందిన గుడిమెట్ల వెంకటరెడ్డి అనే భక్తుడు తన తల్లిదండ్రులతో కలసి శ్రీవారి క్షేత్రాన్ని సందర్శించారు. స్వామివారి దర్శనానంతరం స్వగ్రామానికి తిరుగుప్రయాణం అయ్యే క్రమంలో కొత్త బస్టాండ్‌లో నరసాపురం బస్సు ఎక్కారు. కొంత దూరం వెళ్లిన తరువాత వెంకటరెడ్డి తన జేబులో సెల్‌ఫోన్ లేకపోవడాన్ని గుర్తించాడు. వెంటనే ద్వారకాతిరుమల బస్టాండ్‌కు చేరుకుని సెల్‌ఫోన్ కోసం వెతకడం మొదలు పెట్టాడు. ఆ సమయంలో బస్సు ఎక్కుతున్న మరో భక్తుడి జేబులోని సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించేందుకు ప్రయత్నించడాన్ని గమనించాడు. వెంటనే వెంకటరెడ్డి ఆ వ్యక్తిని పట్టుకుని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు.

కలప పట్టివేత

కొయ్యలగూడెం: మారుజాతి కలప అక్రమ రవాణను అధికారులు అడ్డుకున్నారు. శనివారం తెల్లవారుజామున ప్రత్తిపాడు నుంచి కొయ్యలగూడెం వైపు డీసీఎం వ్యాన్‌లో మారుజాతి కలప తరలిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఎస్ఓ బి.దినేష్ తెలిపారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందన్నారు. వాహనాన్ని కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఎక్సైజ్ దాడులు

చింతలపూడి: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో భూక్యా గోపి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి 2 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే గ్రామానికి చెందిన ఇస్లావతు దివ్యాకు సంబంధించిన రెండు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో భద్ర పరిచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి మహిళపై పరారీ కేసు నమోదు చేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, జె జగ్గరావు, ఏలూరు ఎస్సై ఎండీ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారు

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

గణపవరం: మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని మెనూ ప్రకారం వంట చేయాలని, రాగి జావ నిర్ణీత రోజుల్లో తప్పకుండా పిల్లలకు ఇవ్వాలని డీఈవో వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన గణపవరం మండలం కేశవరం, అప్పనపేట, మల్లపరాజుపేట గ్రామాల్లోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. వంటలు నాణ్యంగా ఉండాలని నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. రాగి జావ తాగుతున్న విద్యార్థులను జావ నాణ్యతపై ప్రశ్నించారు. వారంలో మూడు రోజులు రాగి జావ ఇస్తున్నారా, లేదా అన్న విషయం ఆరా తీశారు. విద్యార్థులంతా తప్పనిసరిగా రాగి జావ తాగాలని, దీనివల్ల రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు. వార్షిక పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎంఈవో గొర్రెల బాలయ్య ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంధనం ధరలు తగ్గించాలి

దెందులూరు: పెంచిన ఇంధనం ధరలను తక్షణమే తగ్గించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దేవదాస్ ప్రేమ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మానూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. పెంచిన ఇంధనం ధరలు ప్రజలకు భారంగా మారాయని తెలిపారు. ప్రజా రంజక పాలన చేస్తామన్న ప్రభుత్వాలు ప్రజలు నడ్డి విడిచేలా వారిపై అధిక భారం మోపేలా వారి జీవన విధానం కొంగ తీసేలా పాలన సాగిస్తున్నారని ఈ విధానం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంధనం ధరలు తగ్గించాలన్నారు.

రబీ ధాన్యాన్ని రైతుసేవా కేంద్రంలో విక్రయించాలి

బుట్టాయగూడెం: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు సేవాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏఓ డి. ముత్యాలరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి బుట్టాయగూడెం మండల పరిధిలో 34 ఎకరాల్లో వరిసాగు నమోదైనట్లు తెలిపారు. నూతిరామన్నపాలెం, లక్ష్మీడుగూడెం, మర్లగూడెం గ్రామాల్లో ఈ రబీ సీజన్‌లో వరి సాగు చేసినట్లు చెప్పారు. ఈ ధాన్యాన్ని రైతులు రైతు సేవా కేంద్రంలోనే విక్రయించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని చెప్పారు. అలాగే జైనవారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై గ్రామసభ నిర్వహించామని చెప్పారు. తహసీల్దార్ పీవీ చలపతి రావుతోపాటు గ్రామ రైతు సేవా కేంద్రం సహాయకులు ఎం.సురేష్, ధాన్యం కొనుగోలు కేంద్రం సూపర్‌వైజర్ కె.సాయిబాబు, సివిల్ సప్లయి ఆర్ఐ పద్మావతి, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు అమలును నిలిపివేయాలి



చింతలపూడి: వక్ఫ్ బోర్డ్ 2025 ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



కుక్కునూరు: సీపీఐ ఆధ్వర్యంలో ముస్లింల నిరసన

చింతలపూడి: వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు అమలును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డ్ 2025 ప్రతులన దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తోర్లపాటి బాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై దాడులు చేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీతో మాట్లాడి వక్ఫ్ బోర్డ్ 2025 అమలను నిలిపివేయడానికి ప్రయత్నం చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య సహాయ కార్యదర్శి దొంతా కృష్ణ, కమిటీ సభ్యులు ఎస్కే కాలేషా మోర్త లక్ష్మణరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కుక్కునూరు: వక్ఫ్ చట్టానికి కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడాన్ని నిరసిస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ముస్లింలు కుక్కునూరు ప్రధాన రహదారిపై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి ముస్లిం మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్రం వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, నకిరికంటి నాగరాజు, ముస్లింలు పాల్గొన్నారు.

దళితులపై కూటమి నేతల వేధింపులు



తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరుతున్న దళిత ఉద్యోగులు

కొయ్యలగూడెం: తమను కూటమి నేతలు వేధిస్తున్నారని, తమను ఉద్యోగాల నుంచి తొలగించి ఆ ఉద్యోగాలను వేరొకరికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని పొంగుటూరు గ్రామపంచాయతీ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న దళిత ఉద్యోగులు వాపోయారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఏగా విధులు నిర్వహిస్తున్న కవులూరి విజయ భారతి మాట్లాడుతూ గత ఆరేళ్లుగా గ్రామంలో సీఏగా విధులు నిర్వహిస్తున్నారని, అయితే కూటమి నేతలు తమ వ్యక్తులను సీఏగా నియమించడానికి తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అధికారులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ శ్యామలరావు మాట్లాడుతూ పదిహేనేళ్లగా విధులు నిర్వహిస్తున్నానని, కానీ కూటమి నేతలు తనను తొలగించి ఆ ఉద్యోగాన్ని వేరొకరికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయాడు. అదేవిధంగా హైస్కూల్లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కై కవరపు గోపి మాట్లాడుతూ తనను తొలగించి వేరొకరిని నియమించేందుకు కూటమి నాయకులు విద్యాశాఖ అధికారులతో మంతనాలు చేస్తున్నారని ఆరోపించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తామంతా ఏ పార్టీకి చెందిన వారం కానప్పటికీ కూటమి నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడి తమ బతుకుదెరువును పోగొట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి తమ ఉద్యోగాలకు భద్రత, తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోండి



చెరువు ఆక్రమణపై ఆరోపణలు చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: పొంగుటూరు శ్రీరామ కట్టు చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు శనివారం పేర్కొన్నారు. చెరువు గర్భం ఆక్రమించి స్థానిక రైతు పామాయిల్ పెంపకం చేస్తున్నాడని, తాజాగా మళ్లీ సుమారు అరఎకరం భూమి ఆక్రమించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు విలేకరులకు తెలిపారు. రాత్రి వేళల్లో జేసీబీలను పెట్టి చెరువు మట్టి తవ్వి చదును చేస్తున్నారని, చెరువు ఆక్రమణతో చేపల పెంపకాన్ని నిర్వహించుకోలేకపోతున్నామని మత్స్యకారులు తెలిపారు. దీనిపై ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆక్రమణ రైతు వలన తమ చేలలోకి వెళ్లే దారి కబ్జా అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆయకట్టు నుంచి తమ చేలకు సాగునీరు కూడా అందదని వాపోయారు. పీడబ్ల్యూడీ, ఇరిగేషన్ శాఖల అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. సర్పంచ్ పసుపులేటి రాంబాబు, ఎంపీటీసీ నేలపూలు దుర్గారావు, రైతులు గేలం శ్రీను, శ్రీరంగం నారాయణుడు, తోట శ్రీను, దిర్శిపోము మధు, నులకాని హనుమంతు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కుక్కునూరు: గత రెండు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నామంటూ కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైస్కూల్‌లో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుడు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌గా సీనియర్ ఉపాధ్యాయినికి బాధ్యతలు అప్పగించారని, ఆమె కూడా మెడికల్ లీవ్ పై వెళ్లడంతో ఆమె స్థానంలో మరో సీనియర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారన్నారు. కానీ ఆయనకు కాకినాడ ఆర్జేడీ నుంచి నియామక ఆర్డర్ రాకపోవడంతో జీతం బిల్లులు పెట్టే అవకాశం లేకుండా పోయిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెండు నెలలుగా వేతనాలు నిలిచాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సమస్యలపై సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీహరిబాబుకి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యచంద్రం, సత్యనారాయణ, నాగేశ్వరరావు, ప్రమీల, శైలజ, రాజు పాల్గొన్నారు.

డీ అడిక్షన్ సెంటర్‌లో తనిఖీ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో యువత, విద్యార్థులు, ప్రజలు మత్తుకు బానిసలుగా మారకుండా ఉండేలా అవగాహన కల్పిస్తూ, చైతన్యవంతులను చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రొబిషన్, ఎక్సైజ్ అధికారి ఎ.ఆవులయ్య తెలిపారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని డీ అడిక్షన్ సెంటర్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడిక్షన్ సెంటర్‌లోని రికార్డులను, బాధితులకు ఇస్తోన్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రగ్ అడిక్షన్ సెంటర్‌తో ఎలాంటి ఫలితాలు వస్తున్నాయో సిబ్బందిని ఆరా తీశారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించి 50 మంది మత్తు బానిసలను డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించి చికిత్స అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. మత్తుకు బానిసలై విలువైన జీవితాన్ని కోల్పోవద్దని హితవు పలికారు.

భార్యాభర్తలకు గాయాలు

భీమడోలు: ఆటో ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల ప్రకారం భీమడోలు మానస స్కూలు రోడ్డులోని అన్నపనేని శ్రీనివాసరావు, ఆతని భార్య బైక్‌పై ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెంలోని తమ కుమార్తెను చూసేందుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ఓ ట్రక్ ఆటో బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వైద్యం కోసం ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షేత్రంలో హోంగార్డులపై మందుబాబు వీరంగం

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన జంటగోపురాల ప్రాంతంలో ఇద్దరు హోంగార్డులపై ఓ మందుబాబు శనివారం వీరంగం సృష్టించారు. దాంతో అతడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. స్థానికుల కథనం ప్రకారం. ద్వారకాతిరుమలకు చెందిన యువకుడు జి.అంజిబాబు (టింకు) మధ్యాహ్నం 1 గంట సమయంలో జంటగోపురాల వద్దకు కారులో వెళ్లాడు. కారు లోపలకు వెళ్లేందుకు బారిగేట్లు అడ్డు తీయాలని అక్కడ విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్ ప్రకాష్‌ను డిమాండ్ చేశాడు. అయితే అంజిబాబు మద్యం సేవించి ఉన్నాడని గుర్తించిన ప్రకాష్ బారిగేట్లు తీయడం కుదరదని చెప్పాడు. దాంతో అతడు హోంగార్డును నోటికొచ్చినట్టు తిడుతూ, వీరంగం సృష్టించాడు. కారును రోడ్డుకు అడ్డంగా పెట్టి సుమారు అరగంట పాటు ట్రాఫిక్‌ను నిలుపుదల చేశాడు. దాంతో భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మరో హోంగార్డు వెంకటేష్ ఇది సరికాదని అంజిబాబును మందలించాడు. దానికి రెచ్చిపోయిన అంజిబాబు అతడిని కూడా నోటికొచ్చినట్టు తిట్టాడు. ఇదేంటని అడ్డువెళ్లిన దేవస్థానం సెక్యూరిటీ గార్డు ప్రసాద్‌పై దాడిచేసి, షర్ట్‌ను చింపివేశాడు. ఎవరెంత చెప్పినా వినకపోవడంతో చివరకు సెక్యూరిటీ సిబ్బంది అతడిని, కారును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఎస్సీ బాలికల వసతిగృహం ఏర్పాటు చేయాలి



ఎస్సీ బాలికల వసతిగృహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్, కాంగ్రెస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం బుట్టాయగూడెంలో ఉన్న వసతిగృహాన్ని మూసివేశారని. ఇప్పటివరకు పోలవరం నియోజకవర్గంలో ఎస్సీ హాస్టల్ లేకపోవడంలో బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం, దొరమామిడి, ముప్పినవారిగూడెం, అచ్చియ్యపాలెం, కొమ్ముగూడెం, కేఆర్‌పురం, మర్లగూడెం, తదితర గ్రామాల ఎస్సీ బాలికలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు బాలికల చదువులను దృష్టిలో పెట్టుకుని బుట్టాయగూడెంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎస్. కుటుంబరావు, మైనారిటీ సెల్ నాయకులు ఏ.ఏసుపాదం, కేవీపీఎస్ నాయకులు పి.రాజు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఎస్.శ్యామ్, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.